సాక్షి ప్రకాశం

సోమవారం | 20 | మార్చి | 2023



కిచ్..కిచకిచ

వేకువన కిలకిలా రావాలతో మేలుకొలుపు పాడే పిచ్చుకలు నానాటికీ కనుమరుగవుతున్నాయి. నేడు పిచ్చుకల దినోత్సవం సందర్భంగా వాటి విశేషాలపై ప్రత్యేక కథనం.
- 8లో..



నిలకడగా పొగాకు ధర

పొగాకు వేలంలో కేజీ పొగాకు సరాసరి ధర రూ.198 వద్ద నిలకడగా ఉంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31 /23

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పొరపాటు ఎక్కడో విశ్లేషించుకుంటాం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఎన్నికల్లో తొలిసారిగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బరిలోకి దిగారని, ఈ క్రమంలో పట్టభద్రులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో కొంత అవగాహన లోపం వల్ల ఓటమిపాలయ్యామని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని అంగీకరిస్తున్నామని, ఇదే క్రమంలో పొరపాటు ఎక్కడ జరిగిందనే దానిపై కూడా విశ్లేషించుకుంటామని తెలిపారు. ఉద్యోగ వర్గాలు కొంత కాలంగా వారి సమస్యల దృష్ట్యా కొంత వ్యతిరేకంగా ఉన్న మాట వాస్తవమే అని, వారి సమస్యలను కూడా పరిష్కరించేందుకు సీఎం చొరవ చూపుతున్నారన్నారు. వారిని కూడా అనుకూలంగా మార్చుకుంటామని చెప్పారు. అన్ని వర్గాల వారి సంక్షేమమే తమకు ముఖ్యమని అన్నారు. మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయభేరి మోగించినా, తాము పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోలేదన్నారు. కానీ మూడు ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానాలు గెలుచుకోగానే సాధారణ ఎన్నికల్లో విజయం సాధించినట్లుగా సంబరాలు చేసుకోవడం టీడీపీకే చెల్లుతుందన్నారు. సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 2 శాతానికి మించి ఓట్లు ఉండవని, వీరిలో ఎక్కువ మంది ఓటర్లు సంక్షేమ పథకాల పరిధిలో ఉండనివారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తొలిసారి విజయదుందుభి మోగించడం ఆనందంగా ఉందన్నారు. బాలినేని వెంట మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

డాక్టర్ మల్లు స్వరాజ్యం ఆశయాలను సాధిద్దాం



మల్లుస్వరాజ్యం ఆశయాలను సాధిద్దామంటూ నినదిస్తున్న ఐద్వా నాయకులు

ఒంగోలు: అసమాన పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధిద్దామని ఐద్వా జిల్లా సీనియర్ నేత వై.అంజనీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్రోద్యమానికి ముందే తెలంగాణ ప్రాంతంలో భూమికోసం, భుక్తికోసం, కష్టజీవుల విముక్తి కోసం, మహిళా సమానత్వం కోసం జరిగిన సమరశీల పోరాటాల్లో మల్లు స్వరాజ్యం ప్రముఖ పాత్ర పోషించారన్నారు. తన కుటుంబం నుంచి జాతీయ ఉద్యమ భావజాలాన్ని అందిపుచ్చుకున్నారని, నైజాం పరిపాలనలో రజాకార్ల దుర్మార్గమైన హింసకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల్లో స్వరాజ్యం పాల్గొన్నారన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభ స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో కూడా జరిగింది. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె మాబు, జీవి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు వై.సిద్దయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు హెచ్3ఎన్5 వైరస్‌పై సదస్సు

ఒంగోలు: మళ్లీ కోవిడ్ అంట? హెచ్3ఎన్5 వైరస్ పరిణామాలకు సంబంధించి ఆరోగ్య సదస్సు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కొల్లా మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సాయి సరోజ్‌మయూరి నర్సింగ్‌హోం పక్కన ఉన్న ది కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాలులో సాయంత్రం 3 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులంతా ఆహ్వానితులే అన్నారు.

పదింతల సన్నద్ధత..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖ సన్నద్ధమైంది. రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకే లక్ష్యంగా.. నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా పక్కా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారికి ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. 10/10 పాయింట్లు సాధించాలని పట్టుదలగా ఉన్నారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలు: 175

హాజరుకానున్న విద్యార్థులు 28,902

- వచ్చే నెల 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు
- పరీక్షలకు విద్యాశాఖ ఏర్పాట్లు
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు
- నూతన పేపర్ల విధానంపై అవగాహన



స్టడీ అవర్స్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

మార్కాపురం: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. సమయం తక్కువగా ఉండటంతో రాత్రి 9 గంటల వరకు స్టడీ అవర్స్ జరుగుతున్నాయి. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా క్లాసులు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లోనే రాత్రిపూట స్టడీ అవర్స్ నిర్వహిస్తూ నూతన విధానానికి విద్యాశాఖాధికారులు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల్లో కూడా టెన్షన్ మొదలైంది. మరో వైపు ప్రభుత్వ పాఠశాలల్లో 10/10 పాయింట్లు సాధించి మంచి పేరు తేవాలన్న పట్టుదల పలువురు ఉపాధ్యాయుల్లో, హెచ్‌ఎంలలో కనిపిస్తోంది. ఇందు కోసం విద్యాశాఖాధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని వారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వచ్చే నెల 3 నుంచి 18 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం గం .12.45 వరకు పరీక్షలు జరుగుతాయి. వచ్చే నెల 19 నుంచి 26 వరకు పరీక్షల మూల్యాంకనం జరుగుతుంది.

మార్కాపురం డివిజన్‌లో 12 మండలాలు ఉన్నాయి. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో 3 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గజ్జలకొండ, తిప్పాయపాలెం, భూపతిపల్లె, పెద్దారవీడు, పెద్దదోర్నాల, తురిమెళ్ల, కంభం, బేస్తవారిపేట, త్రిపురాంతకం తదితర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. కాపీయింగ్ జరగకుండా నిరోధించేందుకు డీఈవో రమేష్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, అర్థవీడు, త్రిపురాంతకం, బేస్తవారిపేట తదితర సెంటర్‌లలో కాపీయింగ్ జరగకుండా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

పదో తరగతి పరీక్షల పేపర్ల విధానం మారటంతో నూతన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం 6 పరీక్షలు మాత్రమే విద్యార్థులకు జరుగుతాయి.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. పరీక్షల్లో మన జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రశ్నపత్రంపై అవగాహన కల్పించాం. మారిన ప్రశ్న పత్రాలకు అనుగుణంగా స్టడీ మెటీరియల్ నమూనా ప్రశ్న కాపీలను పాఠశాలలకు అందజేశాం. విద్యాశాఖ యాక్ట్ 25 ప్రకారం కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థిని డీబార్ చేయటంతో పాటు ఇన్విజిలేటర్‌పై కూడా చర్యలు తీసుకుంటాం.

– రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి, ఒంగోలు

విద్యార్థులు సన్నద్ధం



చదువులో వెనుకబడిన విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధంగా ఉన్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు కూడా బాగా రాస్తున్నారు. మార్కాపురం పేరు రాష్ట్ర స్థాయిలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గ్రాండ్ టెస్టు పెట్టాం. విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో అల్పాహారం పెడుతున్నాం. స్టడీ మెటీరియల్ కూడా అందించాం.

– ఎం.చంద్రశేఖరరెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

బాగా చదువుతున్నాం



డిసెంబర్ నుంచి స్పెషల్ క్లాసులు పెట్టారు. బాగా చదువుతున్నాం. మ్యాథ్స్, ఇంగ్లిషు, సైన్స్ సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించే దిశగా మమ్మల్ని సిద్ధం చేశారు. ఉదయం, సాయంత్రం పూట స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

– సాయినాథ్, పదో తరగతి విద్యార్థి, మార్కాపురం

విద్యార్థులను దత్తత తీసుకున్నాం



క్లాసులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మా టీచర్స్ అందరం దత్తత తీసుకున్నాం. వారికి ప్రత్యేక క్లాసులు పెడుతున్నాం. ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాం. టీవీ, మొబైల్ ఇవ్వొద్దని చెప్పాం. చదువుకునే వాతావరణం ఇంట్లో కల్పించాలని సూచించాం.

– జీఎల్ రమేష్ బాబు, ఉపాధ్యాయుడు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఆరామ క్షేత్రంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం
- నావంతుగా రూ.10 లక్షలు విరాళంగా అందిస్తా
- వచ్చే నెలలోనే రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మాజీ మంత్రి శిద్దా, మేయర్ గంగాడ

ఒంగోలు: ఆర్యవైశ్యులకు అన్ని వేళలా అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కరుణా కాలనీ ఎదురుగా నూతనంగా నిర్మించనున్న ఆర్యవైశ్య ఆరామ క్షేత్ర భూమి పూజకు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఏ అవసరం వచ్చినా పార్టీలకు అతీతంగా సాయం చేయడం తన ధర్మంగా భావిస్తానన్నారు. అందులో భాగంగానే నాలుగు నెలల క్రితం తన వద్దకు వచ్చి 21 ఏళ్లుగా ఆరామ క్షేత్రం లేకపోవడంతో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యను తనవద్దకు పెద్దలు తీసుకొచ్చారన్నారు. దాంతో స్థలం ఎక్కడ కావాలో చూసుకుంటే ఇప్పిస్తానని హామీ ఇచ్చానని, వారు ఈ స్థలాన్ని ఎంపికచేసుకోవడంతో నగరపాలక సంస్థలో తీర్మానం చేయించి సుమారు 75 గదులు ఇప్పించగలిగానన్నారు. ఈ నిర్మాణానికి తన వంతుగా రూ.10 లక్షలు ఆర్థికసాయం కూడా అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్మాణాన్ని పూర్తిచేసుకుని సంక్రాంతి నాటికి ప్రారంభించుకునేలా చర్యలు చేపడతామని ఆరామ క్షేత్ర కమిటీ అధ్యక్షుడు మునగా కృష్ణారావు ప్రకటించడం పట్ల బాలినేని సంతోషం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహ నిర్మాణం పూర్తయిందని, దానిని ఏప్రిల్ నెలలో స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేస్తారన్నారు. కాంప్లెక్స్ పై అంతస్తు నిర్మాణం అనధికారికంగా జరిగిందని, దానిని క్రమబద్ధీకరించాలని వ్యాపారులు తన దృష్టికి తెచ్చారన్నారు. ఇది ప్రత్యేక జీవోతో మాత్రమే సాధ్యమవుతుందని, దీనిపై సీఎంతో మాట్లాడి ఆ సమస్యను కూడా తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఆరామ క్షేత్రం పక్కనే బహుజన హిందూ ఆరామ క్షేత్రం నిర్మాణం కూడా జరగనుందని, దానికి దాతలతోపాటు తన వంతు సాయం కూడా అందించి వేగంగా నిర్మించేందుకు సహకరిస్తానని బాలినేని ప్రకటించారు. ఆరామ క్షేత్ర నిర్మాణం పార్టీలకు అతీతంగా జరగాలనేది తన ఉద్దేశమని, అందులో భాగంగానే ప్రతి ఒక్క ఆర్యవైశ్య కుటుంబాన్ని భాగస్వాములను చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. గోశాల సమస్య పరిష్కరించేందుకు గోరంట్ల ట్రస్టు, గోశాల కమిటీ ఇద్దరితో స్వయంగా మాట్లాడతానని బాలినేని హామీ ఇచ్చారు. మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు మాట్లాడుతూ నగరం నడిబొడ్డున రూ.2 కోట్లకుపైగా విలువచేసే స్థలాన్ని ఆర్యవైశ్యులకు ఆరామ క్షేత్రంగా ఇవ్వడం బాలినేని మంచి మనస్సుకు నిదర్శనం అన్నారు. మంచి మనస్సున్న ఆయనకు ఆర్యవైశ్యులు అండగా ఉండేందుకు ముందుకు రావాలన్నారు. ఆరామ క్షేత్ర నిర్మాణంలో సాయం అందిస్తామని ప్రకటించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరామ క్షేత్రానికి మా కౌన్సిల్‌లో స్థలం కేటాయించేందుకు అవకాశం దక్కడం మా అదృష్టంగా భావిస్తున్నామని, అదే విధంగా ట్రంకురోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్యవైశ్య పెద్దలు అందరికీ ఆమోదయోగ్యమయ్యే ప్లాన్‌ను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అందరూ బాగుండాలనేదే తమ ఉద్దేశమని, ఎవరినీ ఇబ్బంది పెట్టబోమని వివరించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులంటే బాలినేనికి ఎంతో అభిమానం అని, అందువల్లే ఆయన అడిగిందే తడవుగా భారీ విలువైన స్థలాన్ని రోడ్డు పక్కన ఆర్యవైశ్యులకు కేటాయించారని పేర్కొంటూ బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. ఆరామ క్షేత్రం అధ్యక్షుడు మునగా కృష్ణారావు మాట్లాడుతూ సంక్రాంతి నాటికి భవనాన్ని కూడా పూర్తిచేసి బాలినేనితో ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆరామ క్షేత్రం ఉపాధ్యక్షుడు తడవర్తి వాసు, శనగపల్లి శ్రీనివాస్, మధుసూదనరావు తోపాటు ఆర్యవైశ్య సంఘ నాయకులు శిద్దా నాగేశ్వరరావు, అమరా శ్రీనివాసరావు, ఆర్‌ఎస్ శ్రీను, జగన్మోహన్‌రావు, ఆనంద్, వినోద్, రామస్వామి, గోనుగుంట మధుసూదనరావు, తాతా బదరీనాథ్, మిరియాల కృష్ణ, కార్పొరేటర్లు ఎండేటి పద్మావతి రంగారావు, చల్లా తిరుమలరావు పాల్గొన్నారు.

విద్యకు సీఎం అధిక ప్రాధాన్యత

- విద్యార్థుల మనస్సులో చిరస్థాయిగా వైఎస్సార్ కుటుంబం
- మంత్రులు తానేటి వనిత, మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్

మార్కాపురం: విద్యకు సీఎం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, ఇందులో భాగంగానే నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, మేరుగు నాగార్జున, డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం రాత్రి డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాల 26వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కంటే మిన్నగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయటంతో కోట్లాది మంది విద్యార్థుల మనస్సుల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు నిలిచిపోయారని అన్నారు. పేదరికం కారణంగా చదువుకు ఏ ఒక్క విద్యార్థి దూరంకాకూడదనే లక్ష్యంతో వైఎస్‌ఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సీఎం జగన్ మరింత ఉన్నతంగా తీర్చిదిద్ది అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ పథకాలతో కార్పొరేట్ విద్య పేద విద్యార్థులకు అందుతోందని చెప్పారు. ఇంకా పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి ఆసరా, చేయూత పథకాలను అందించిన ఘనత కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలని సూచించారు. అంబేడ్కర్ విద్యా విధానాలను జగన్ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ డాక్టర్ జార్జి, థెరిస్సమ్మలు 25 ఏళ్ల క్రితం ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొదటి ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించి సాంకేతిక విద్యను అందించారన్నారు. గత 16 ఏళ్లుగా సాంకేతిక విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. జార్జి కళాశాల 50 ప్రముఖ కంపెనీలతో ప్లేస్‌మెంట్‌ల కోసం ఎంవోయూ కుదుర్చుకుందన్నారు.

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని, చెడు ఆలోచనలకు అవకాశం ఇవ్వవద్దని, డ్రగ్స్‌కు, మద్యానికి, గ్యాంబ్లింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ 85 శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్ రావటం అభినందనీయమన్నారు. ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని హోం మంత్రి వనిత స్వీకరించారు. కార్యక్రమంలో కళాశాల అడ్వయిజర్ డాక్టర్ సతీష్, కార్యదర్శి విశాల్, చైర్మన్ బాలమురళీకృష్ణ, డీఎస్పీ కిషోర్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ఈశ్వరయ్య, ప్రొఫెసర్లు రాజబాబు, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు. ముగ్గురు మంత్రుల పర్యటన సందర్భంగా సీఐ భీమానాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న హోం మంత్రి వనిత, పక్కన మంత్రులు నాగార్జున, సురేష్, ఎస్పీ మల్లికాగర్గ్, ఎమ్మెల్యే కేపీ

నేడు స్పందన కార్యక్రమం

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నేటి సోమవారం నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో తిరిగి చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసినందున స్పందనతో పాటు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి డయల్ యువర్ కలెక్టర్, 11 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి

- అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుంది
- తొలి విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ
- ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరులో ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- ప్రకాశం భవనంలో వీడియో సమావేశం ద్వారా పాల్గొన్న అధికారులు



జగనన్న విద్యాదీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: బడుగు, బలహీన వర్గాల్లోని పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని, అందుకు అన్నీ విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి లక్ష్మానాయక్ అన్నారు. జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా 2022–23 విద్యా సంవత్సరానికి తొలివిడత ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరులో ప్రారంభించారు. దీనికి అనుబంధంగా నిర్వహించిన వీడియో సమావేశంలో ప్రకాశం భవనం నుంచి జిల్లా అధికారులు పాల్గొన్నారు. లక్ష్మానాయక్ మాట్లాడుతూ జిల్లాలో 50,174 మంది విద్యార్థులకు చెందిన రూ.37,46,28,125లను 45,241 మంది తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వారిలో ఎస్సీ విద్యార్థులు 12,913 మంది, ఎస్టీలు 1185, బీసీలు 16,574, ఈబీసీలు 13,276, ముస్లిం మైనారిటీలు 3186, కాపులు 2984, క్రిస్టియన్ మైనారిటీలు 56 మంది ఉన్నట్లు తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసినట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులకు బ్యాంకు చెక్కును అధికారులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, దివ్యాంగుల సంక్షేమ అధికారి అర్చన ఇతర సంక్షేమ శాఖల అధికారులు వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిచ్.. కిచకిచ!

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం


వేకువ జామున కిలకిలారావాలతో మేలు కొలుపు పాడే పిచ్చుకలను చూస్తే మన సుకు కాసింత హాయి.. చూరుకు వేలాడదీ సిన వరి కంకులు తింటూ 'కిచ కిచ' మంటూ గోల చేసే చిట్టి పిట్టలు కలిగించే ఉత్సాహం మాటల్లో చెప్పలేం.! ఇసుక, మట్టిలో పొర్లాడే దృశ్యాలు.. అద్దంలో తనను తాను చూసుకుని మురిసిపోతూ పిట్టలు సందడి చేసిన క్షణాలు ఎంతో మందికి తీపి జ్ఞాపకాలు. మనిషికి దగ్గరగా ఉంటూ మన కుటుంబంలో ఒకరుగా ఉన్న పిచ్చుకలు.. మానవజాతి చేస్తున్న తప్పిదాలకు బలైపోతున్నాయి. ప్రపంచంలో వేగంగా అంతరిస్తున్న పక్షుల జాబితాలో తొలి స్థానంలో ఉన్న పిచ్చుకలను రక్షించుకోకపోతే జీవవైవి ధ్యానికి పెనుముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయి. నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా వాటి విశేషాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- సాక్షి, ప్రకాశం డెస్క్



▲ కొత్తపట్నం సముద్ర తీరంలో రిసార్ట్ వద్ద బిడ్డకు ఆహారం తినిపిస్తున్న తల్లి పిచ్చుక

- పిచ్చుకల జీవిత కాలం నాలుగు నుంచి ఐదేళ్లు
- బరువు 35 నుంచి 40 గ్రాములు
- ఎగిరే వేగం గంటకు 38.5 నుంచి 50 కి.మీ
- ఐదు నుంచి ఎనిమిది గుడ్లు పెడతాయి. 10 నుంచి 15 రోజుల్లో పొదుగుతాయి.
- ప్రత్యర్థుల నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు నీళ్లలో ఈదగలదు
- ఆడ పిచ్చుకల్ని ఆకర్షించేందుకు మగ పిచ్చుకలే గూళ్లు కడతాయి



పూర్వం మధ్యదరా ప్రాంతంలో ఆవాసముండే పిచ్చుకలు కాలక్రమంలో ప్రపంచమంతటా విస్తరించాయి. అడవుల్లో కాకుండా మానవులకు దగ్గరగా ఉండేందుకే అవి ఇష్టపడతాయి. గూడుకు ముప్పు వస్తుందనుకుంటే ఇతర జాతుల పక్షులపై దాడి చేసేందుకూ వెనుకాడవు. మగ, ఆడ పిచ్చుకలు అదే వర్గానికి చెందిన పక్షులపై మాత్రమే దాడి చేయడం ఇక్కడ విశేషం.

▸ 65 ఏళ్ల క్రితం అంటే 1958లో చైనా పాలకుడు మావో జెడాంగ్ పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం సంధించాడు. పంటలు నాశనం చేస్తున్నాయనే నెపంతో లక్షల సంఖ్యలో పిట్టలను కాల్చిపడేయించాడు. పంటల వద్ద పళ్లేలతో చైనీయులు చేసిన శబ్దాల ధాటికి పిచ్చుకలు బతుకుజీవుడా అనుకుంటూ దూరంగా వెళ్లి తలదాచుకున్నాయి. ఆ తర్వాత పంటలను చీడపీడలు ఆశించడంతో తిండిగింజలు కరువయ్యాయి. రెండేళ్లలోనే తాము చేసిన తప్పు చైనీయులకు తెలిసొచ్చింది. పిట్టలు బతికుంటేనే పంటకు రక్ష అని గుర్తించిన చైనీయులు వాటిని సంరక్షించడం మొదలుపెట్టారు. జీవవైవిధ్యానికి పిచ్చుకలు ఎంతలా దోహదపడతాయో తెలిపేందుకు ఇదొక ఉదాహరణ.

ఖండాలు దాటి వచ్చే చిన్ని పిచ్చుక..

చూడటానికి పిచ్చుకల్లా ఉండే ఈ పక్షులు ఏటా శీతాకాలంలో పశ్చిమ దేశాల నుంచి నల్లమల అభయారణ్యానికి లక్షల సంఖ్యలో వలస వస్తుంటాయి. వీటితోపాటు వలస వచ్చే హారియర్స్ అనే గద్ద జాతి పక్షులు గ్రేటర్ షార్ట్ టోడ్ లార్క్‌లను వేటాడి తింటాయి.



గ్రేటర్ షార్ట్ టోడ్ లార్క్

▸ పిచ్చుకలు అంతరించిపోతుండటానికి కారణాలు అనేకం. భూతాపోన్నతి నుంచి రక్షణ కోసం మానవ జాతి వినియోగిస్తున్న అన్‌లెడెడ్ పెట్రోల్ అందులో ఒకటి. ఈ పెట్రోల్‌ను మండించినప్పుడు విడుదలయ్యే మిథైల్ నైట్రేట్.. చాలారకాల క్రిమికీటకాలకు విషంలా మారుతోందని, ఫలితంగా పిచ్చుకలకు ఆహారం దొరకకుండా పోతోందని ఆర్నితాలజిస్టులు(పక్షి శాస్త్రవేత్తలు) తమ పరిశోధనల ద్వారా గుర్తించారు. పట్టణాలు, నగరాల్లో భవన నిర్మాణ శైలి మారడంతో పిచ్చుకలకు గూళ్లు కట్టుకునే అవకాశాలు తగ్గాయి. పెరటి తోటలు అంతంతమాత్రంగా ఉండటం, వాహనాల రణగొణధ్వనులు, సెల్ టవర్ల రేడియేషన్, పంటల సాగులో రసాయనాలు అధికంగా వినియోగించడం తదితర కారణాలు పిచ్చుకల జీవనానికి ముప్పుగా పరిణమించాయి.

▸ ప్రపంచంలో ఏటా పిచ్చుకల సంఖ్య తగ్గిపోతుండటంతో ఐక్యరాజ్యసమితి స్పందించింది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ తయారు చేసిన రెడ్‌లిస్ట్ జాబితాలోకి పిచ్చుకలను చేర్చింది. మన దేశంలోనూ పిచ్చుకల్ని సంరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాయి.



నిలకడగా పొగాకు ధర

- కేజీ పొగాకు రూ.200 - రూ.197 మధ్య కొనసాగుతున్న ధర
- వేలం ప్రారంభమైన గత 20 రోజులలో ఇప్పటి వరకు 86.9 లక్షల కేజీల పొగాకు కొనుగోళ్లు
- వాటిలో 72.7 లక్షల కేజీల (83.6%) వరకు నాణ్యత కలిగిన నంబర్-1 పొగాకు
- ధర నిలకడగా ఉండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు



వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్న బయ్యర్లు, రైతులు (ఫైల్)

చీమకుర్తి: పొగాకు మంచి రంగుమీద ఉంది. దిగుబడి అంతకు మించి వచ్చింది. బయ్యర్లు కూడా రైతులను సంతృప్తి పరిచే ధరలను ఇస్తుండటంతో వేలం ప్రారంభమైన నాడు ఉన్న ధరకు, నేటికి రెండు మూడు రూపాయల వ్యత్యాసమే తప్ప పెద్దగా తగ్గింది లేదు. కేజీ పొగాకు ధర గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.196, సరాసరిన రూ.198 ధర పలుకుతోంది. పొగాకు బోర్డు అధికారుల నుంచి సేకరించిన గణాంకాలు ఈ విషయాలను ధ్రువీకరిస్తున్నాయి. పొగాకు సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ తులసి తెలిపిన వివరాల ప్రకారం ... పొగాకు వేలం ధరలు ఫిబ్రవరి 24వ తేదీన మొదటి సారి 4 ప్లాట్‌ఫాంలలోను, మార్చి నెల 9 మిగిలిన 7 ప్లాట్‌ఫాంలలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మొత్తం 11 ప్లాట్ ఫాంలలో కలిపి ఇప్పటి వరకు మొత్తం 86,98,285 కేజీల పొగాను బోర్డు ద్వారా బయ్యర్లు కొనుగోలు చేశారు. సరాసరి ధర రూ.198 వరకు పలికింది. బయ్యర్లు కొనుగోలు చేసిన పొగాకులో కూడా నాణ్యత కలిగిన నంబర్-1 రంగు (బ్రైట్) పొగాకు 72,72,966 కేజీలు (83.6%) ఉంది. మీడియం రంగు పొగాకు 14,18,209 కేజీలు, లోయర్ రంగు పొగాకు 7,126 కేజీలను కొనుగోలు చేశారు. వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలైనప్పటి నుంచి పొగాకు ధర నిలకడగా రాణిస్తుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పొగాకు రైతులకు మంచి రోజులు వచ్చాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది 101 మిలియన్ కేజీలను కొనాలని నిర్ణయించగా వాటిలో ఇప్పటి వరకు 8.69 మిలియన్ కేజీల పొగాకును గత 20 రోజుల్లోనే కొనుగోలు చేసినట్లయింది. దాదాపు 120 రోజుల వరకు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. మరో నెల రోజుల పాటు కేజీకి రూ.198-రూ.200 మధ్య ధర స్థిరంగా ఉంటే పొగాకు రైతుల పంట పండినట్లేనని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి

మద్దిపాడు: మద్యం మత్తులో మురుగు కాల్వలో పడి మధ్య ప్రదేశ్‌కు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బూరేపల్లి పునరావాస కాలనీ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌కు చెందిన సునీల్ మెహరా(40) రెండేళ్లుగా గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని జ్యోతి గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పని చేస్తున్నాడు. ఈనెల 17వ తేదీన నెల జీతం అందగా 18వ తేదీ మద్యం కొనుగోలు చేశాడు. రాత్రి 10 గంటల సమయంలో కాలనీ పక్కన ఉన్న మురుగు కాల్వ కల్వర్టుపై కూర్చుని మద్యం తాగాడు. మత్తులో ఉన్నపుడు మురుగు కాల్వలో పడిపోవడంతో తల బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న అల్తాఫ్.. కాలనీ సమపంలోని మురుగు కాలువ వద్ద ప్రజలు గుమిగూడటాన్ని గమనించి అక్కడికి చేరుకున్నాడు. మృతి చెందిన వ్యక్తి సునీల్‌మెహరాగా గుర్తించాడు. వెంటనే మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించగా ఇన్‌చార్జి ఎస్‌ఐ హరిబాబు, మద్దిపాడు ఏఎస్‌ఐ రమేష్ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుని బంధువులకు సమాచారం అందించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ హరిబాబు, ఏఎస్‌ఐ రమేష్ కృష్ణ

క్లుప్తంగా

ఏకేయూ డీన్‌గా డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి



డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్సిటీ డీన్‌గా డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం వైస్ ఛాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వెంకటేశ్వరరెడ్డి డీన్‌గా బాధ్యతలు స్వీకరించగా, ప్రిన్సిపాల్‌గా రాజమోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్‌గా నిర్మలామణి, అకడమిక్ డీన్‌గా గంగాధర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా జ్ఞానేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా సోమశేఖర, ఓఎస్‌డీగా రాజు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా పద్మజ, వుమన్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్‌గా భారతి, ఎస్టేట్ అండ్ అసెట్స్ ఆఫీసర్‌గా కృష్ణ నియమితులయ్యారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఆంధ్రకేసరి యూనివర్సిటీ కింద డిగ్రీ, పీజీ ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

టంగుటూరు: కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ సంఘటన జరుగుమల్లి మండలం పాలేటిపాడు ఎస్సీ కాలనీ వద్ద ఆదివారం జరగ్గా..ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు..కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి స్వగ్రామ నుంచి టంగుటూరు వైపు వస్తుండగా మార్గమధ్యంలో పాలేటిపాడు గ్రామ ఎస్సీ కాలనీ వద్దకు రాగానే కారుకి కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొంది పక్కన ఉన్న కాలువలో పడింది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా నడుపుతున్న కృష్ణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108లో ఒంగోలుకు తరలించారు.



కాలువలో పడిన కారు, పక్కన తీవ్ర గాయాలైన కృష్ణారెడ్డి

కవిత్వానికి భావావేశం, భావోద్వేగం ముఖ్యం

- ప్ర.ర.సం జిల్లా అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు



వెన్నెలపూలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా రచయితలు

ఒంగోలు: కవిత్వానికి భావావేశం, భావోద్వేగంతో పాటు భావ తీవ్రత, భావ సాంద్రత, అనుభూతి గాఢతలు ముఖ్యమని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు అన్నారు. స్థానిక రవీంద్రభారతి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ప్రముఖ కవి చుండూరు శ్రీనివాసులు రచించిన అయిదవ పుస్తకం వెన్నెలపూలు కవితా సంపుటిని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొన్నూరి వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ చీకటి నిండిన జీవితాలలో వెలుగులు నింపే కవిత్వం, కష్ట జీవులను కార్యోన్ముఖులను చేసే కవిత్వం, తాడితులు, పీడితులకు బాసటగా నిలిచే కవిత్వం నేటి సమాజానికి అవసరమన్నారు. అలాంటి కవిత్వం చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. చుండూరి శ్రీనివాసరావు కవిత్వం చిత్రాలను సైతం మాట్లాడించే శైలిని సంతరించుకున్నాయని పేర్కొంటూ ఆయన్ను అభినందించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని నిశితంగా పరిశీలించిన చుండూరి మంచిభావాలతో కవితా సంపుటిని వెలువరించారన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విద్యుత్‌శాఖ ఏఏఓ కె.చినబాబు మాట్లాడుతూ అనల్పమైన అక్షరాలతో అనంతమైన భావాలు శ్రీనివాసరావు పలికించారన్నారు. రచయిత చుండూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు లభించే ప్రోత్సాహం వల్లే సమాజానికి దిశానిర్దేశం చేసే వెలుగు దివిటీ వంటి కవిత్వాన్ని ప్రచురిస్తాను అన్నారు. వై.పాలెం మన సంస్కృతి అధ్యక్షుడు మూడమంచు వెంకటేశ్వర్లు, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్, అమృతవర్షిణి అధ్యక్షుడు కేఎస్‌వీ ప్రసాద్, కనిగిరి సాహితీ సుధ ప్రధాన కార్యదర్శి పాలూరు శివప్రసాద్ తదితరులు పాల్గొనగా రచయిత దంపతులను ఘనంగా సత్కరించారు.

రైతు దయనీయ స్థితికి దర్పణం మట్టిబండి



రచయిత నాగభైరవ ఆదినారాయణను సత్కరిస్తున్న కవులు

ఒంగోలు: రైతు దయనీయ స్థితికి దర్పణం మట్టిబండి అని ఎన్‌టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ రచించిన మట్టిబండి పుస్తకావిష్కరణకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షర సేద్యం చేస్తున్న కవి విత్తనాలతో సేద్యం చేసే రైతుల గురించి ఆవేదన వ్యక్తం చేస్తూ రాయడం గొప్పగా ఉందన్నారు. రైతులు పడుతున్న యదార్థ దృశ్యాలకు నిలువుటద్దం ఈ పుస్తకం అని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు హృదయాన్ని ఎంతో గొప్పగా ఆవిష్కరించారని కొనియాడారు. రైతు పరంగా వచ్చిన పుస్తకాలలో ఈ మట్టిబండిని గురించి విశ్లేషిస్తూ భూమిపుత్రుల కష్టాల కడగండ్లను, వారి దుర్భర జీవితాలను సమగ్రంగా మన కళ్లముందు ఉంచేందుకు రచయిత గొప్ప ప్రయత్నం చేశారన్నారు. సభలో వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), జక్కంపూడి సీతారామారావు, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షురాలు టి.అరుణ, డాక్టర్ వి.సింగారావు, కుర్రాప్రసాద్‌బాబు, మిడసల మల్లిఖార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కవిసమ్మేళనం నిర్వహించి నాగభైరవ ఆదినారాయణను ఘనంగా సత్కరించారు.

దర్శిలో వడగండ్ల వాన



కురిసిన వడగండ్లు చూయిస్తున్న స్థానికులు

దర్శి: దర్శి పట్టణంలో ఆదివారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. ఆదివారం సాయంత్రం మబ్బులు వచ్చి గాలి వాన వచ్చింది. ఒక్కసారిగా వడగండ్ల వాన కురవడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఇంత ఎక్కువగా వడగండ్ల వాన కురవడం ఇదే తొలిసారని స్థానికులు చెప్తున్నారు.

తాళ్లూరు: తాళ్లూరులో ఆదివారం రాత్రి వడగండ్ల వాన దంచికొట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వడగండ్లతో కూడిన పెద్ద వర్షం కురవడంతో ప్రజలు ఆందోళన చెందారు. పెద్దపాటి శబ్దంతో వర్షం కురిసి రోడ్లన్నీ వడగండ్లతో జలమయమయ్యాయి.



కొర్రపాటివారిపాలెంలో పేరుకుపోయిన వడగండ్లు

24 నుంచి ఆర్‌సీసీ క్రికెట్ పోటీలు

సీఎస్‌పురం: శ్రీరామ నవమి పండగను పురస్కరించుకుని మండలంలోని శీలంవారిపల్లిలో ఈ నెల 24 నుంచి నాయుడు రాంబాబు ఆధ్వర్యంలో 21వ ఆర్‌సీసీ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు శీలంవారిపల్లి యూత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు వరుసగా రూ.50,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116తోపాటు షీల్డ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు ఈ నెల 23వ తేదీ లోగా రూ.500 ప్రవేశ రుసుం గూగుల్ పే నంబర్ 9493355202కు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8088873676, 9032607608ను సంప్రదించాలని కోరారు.